సంక్షేమ పథకాలతో అందరికీ లబ్ధి

రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

భీమవరం అర్బన్: కులమతాలు, పార్టీలకు అతీతంగా ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాల ఫలాలు అందించిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానిదేనని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. భీమవరం మండలంలోని కొవ్వాడ అన్నవరం, నరసింహపురం గ్రామాలలో మంగళవారం పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ పాల్గొని మాట్లాడారు. చంద్రబాబు అధికారమే పరమావధిగా కుట్రలు, కుతంత్రాలు పన్ని మోసాలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచారని విమర్శించారు. 2014 ఎన్నికలలో చంద్రబాబు నెరవేరని 600 హామీలు ఇచ్చారని అందులో బ్యాంకులకు ఒక్క రూపాయి కూడా కట్టనవసరం లేదని మీ చంద్రబాబు చూసుకుంటాడని హామీ ఇచ్చాడని అధికారంలోకి వచ్చాక బ్యాంకులకు ఒక్క రూపాయి కూడా కట్టకపోవడంతో రైతులు, మహిళలు అధిక వడ్డీలకు అప్పులు చేసి అప్పుల కంటే రెట్టింపు నగదును బ్యాంకులకు చెల్లించి తీవ్రంగా మోసపోయారన్నారు. అంతేకాకుండా ఓటుకు నోటు కేసులో తెలంగాణలో చంద్రబాబు అడ్డంగా దొరికిపోయి 10 సంవత్సరాల పాటు ఉండాల్సిన ఉమ్మడి రాజధాని హైదరాబాద్‌ను తెలంగాణకు అమ్మేశాడన్నారు. పోలవరం ప్రాజెక్టుకు మంజూరైన కేంద్ర నిధులను మళ్లించి అటకెక్కించారని దీంతో సాక్షాత్తు ప్రధాని మోదీ పోలవరం ప్రాజెక్టు నిధులను ఏటీఎమ్‌లా చంద్రబాబు వాడుకుంటున్నారని గుర్తు చేశారు. గతంలో వలంటీర్లు ఇళ్లలో మగాళ్లు లేనప్పుడు తలుపులు కొడుతున్నారని సంభోదించి చంద్రబాబు ఇప్పుడు అధికారంలోకి వస్తే నెలకు రూ. 10 వేలు ఇస్తానని చెప్పడం అధికారం కోసం ఎవరినైనా మోసం చేసేందుకు సిద్ధమయ్యాడని విమర్శించారు. స్కిల్ డవలప్‌మెంట్ కేసులో అన్ని అధారాలతో దొరికిపోయిన చంద్రబాబు వ్యవస్థలను మేనేజ్‌చేసి అనారోగ్య కారణాలు చూపి బయట తిరుగుతున్నాడన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గడిచిన 58 నెలల్లో మీకు మేలు జరిగితేనే తమ ప్రభుత్వానికి అండగా నిలబడి ఆశీర్వదించండి అంటున్నారని దేశంలో ఏ రాష్ట్ర ముఖ్యమంత్రి ఇంత దమ్ముగా ప్రజలను అడగలేదన్నారు. సంక్షేమ పథకాలు ద్వారా ప్రతి కుటుంబానికి రూ. 50 వేలు నుంచి 10 లక్షలు వరకు లబ్ధి చేకూర్చారన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా అర్హతే ప్రామాణికంగా లబ్ధిదారులకు కుల, మత, బేధ, రాజకీయ చూడకుండా అవినీతి అక్రమాలకు తావు లేకుండా డీబీటీ ద్వారా ఖాతాల్లోకి జమ చేస్తున్నారన్నారు. నియోజకవర్గంలో తాడేరు వద్ద రూ. 2 కోట్ల 30 లక్షలతో వంతెన నిర్మించామని, పట్టణాన్ని రూ. 100 కోట్లతో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు ఎన్నో అభివృద్ధి పనులు చేశామన్నారు. జలజీవన్ మిషన్ ద్వారా స్వచ్ఛమైన తాగునీటి అందించేందుకు పైపులైన్‌లు నిర్మిస్తున్నామన్నారు. జిల్లా కేంద్రం భీమవరం రావడానికి ఎన్నో కష్టాలు పడ్డానని అందివచ్చిన మంత్రి పదవిని వదులుకోవాల్సి వచ్చిందన్నారు. 100 పడకల ఆస్పత్రి కోసం రూ. 16 కోట్లు విలువ చేసే 4 ఎకరాల భూమిని సొంతంగా ప్రభుత్వానికి రిజిస్ట్రేషన్ చేయించి ఇచ్చానన్నారు. నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా నిరంతం శ్రమిస్తున్నానని అందరూ అండగా మరోసారి నియోజకవర్గంలో తనను, నరసాపురం పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమా బాలను అధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర క్రిస్టియన్, మైనారిటీ సెల్ చైర్మన్ మేడిది జాన్సన్, ఎంపీపీ పేరిచర్ల విజయ నరసింహరాజు, మండల అధ్యక్షుడు తిరుమాని ఏడుకొండలు, గూడూరి జగదీష్, ఉద్ధరాజు రాజేష్ వర్మ, వేగేశ్న నరసింహరాజు, అల్లూరి సాయి దుర్గ రాజు, రేవుల గడ్డ రాజ్‌కుమార్, ఉద్ధరాజు పాండురంగరాజు, సత్యనారాయణ రాజు, రామకృష్ణంరాజు, ముదునూరి వెంకటరామరాజు, సిరిపరుపు వెంకటరావు, తేజ తోట మనోజ్, సిరిపరుపు దుర్గా ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

ఆధ్యాత్మిక సేవలతోనే ఉపశమనం


పంచాంగ కర్త దోనేపూడి కృష్ణ పరమాత్మను సత్కరిస్తున్న దృశ్యం

ఆకివీడు: క్రోధి నామ సంవత్సంలో కోపతాపాలు అధికంగా ఉంటాయని పంచాంగ కర్త బ్రహ్మశ్రీ దోనేపూడి కృష్ణపరమాత్మ చెప్పారు. స్థానిక పెద్దింటి అమ్మవారి ఆలయంలో మంగళవారం ఆయన పంచాంగ శ్రవణం చేశారు. క్రోధ అంటే కోపం అని.. భార్యా భర్తలు, సోదర సోదరీమణులు, రాజకీయ నాయకులు ఇలా ప్రతి ఇద్దరు, ముగ్గురు కలిస్తే కోపతాపాలు పెరిగిపోయే పరిస్థితి నెలకొంటుందని, ఆధ్యాత్మిక కార్యక్రమాలతో వాటికి ఉపశమనం లభిస్తుందని చెప్పారు. యజ్ఞ యాగాదులు అధికంగా చేయాలన్నారు. అనంతరం ఆయన్ని ఆలయ చైర్మన్ బొమ్మారెడ్డి మాధవరెడ్డి, డైరెక్టర్లు కుంకట్ల చంద్రవతి, ఆవాల శ్రీనివాసరావు, మణిపురి మహేష్, మెప్మా అధ్యక్షురాలు మోరా జ్యోతి, శ్రీనివాస రెడ్డి తదితరులు సత్కరించారు. ఉగాది పర్వదినం సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.

క్లుప్తంగా

నూకాలమ్మ చీర తయారీకి వెండి విరాళం


అమ్మవారి చీర తయారీకి వెండి విరాళంగా అందజేస్తున్న దాత మంతెన లక్ష్మి బంగార్రాజు దంపతులు

భీమవరం (ప్రకాశం చౌక్): భీమవరం 33వ వార్డు సిరియాల వారి వీధిలో నూకాలమ్మ అమ్మవారికి వెండి చీర తయారు చేయుటకు దాతలు విరాళాన్ని అందజేశారు. భీమవరం పట్టణానికి చెందిన మంతెన లక్ష్మి బంగార్రాజు, పద్మావతి దంపతులు మంగళవారం 300 గ్రాముల వెండిని ఆలయ కమిటీకి విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో గౌరవ సలహా సభ్యులు మెట్టా మురళీ కృష్ణ, అధ్యక్షుడు సిరియాల నాగేశ్వరరావు, కార్యదర్శి రౌతు హరిబాబు పాల్గొన్నారు.

రాములోరి కల్యాణానికి ఏర్పాట్లు


ఉత్సవాలకు పందిరి రాట వేస్తున్న దృశ్యం

ఆకివీడు: శ్రీరామనవమి ఉత్సవాలకు ఏర్పాట్లు ప్రారంభించారు. ఇందుకోసం మంగళవారం పందిరి రాట వేసి పనులను ప్రారంభించారు. స్థానిక కూరగాయల మార్కెట్‌వద్ద నవమి ఉత్సవాల్ని గత 48 ఏళ్లుగా కొనసాగిస్తున్నారు. 49వ నవమి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేపట్టారు. లక్క విగ్రహాల్ని ఏర్పాటు చేసి ఉత్సవాల్ని ఘనంగా చేయడం ఇక్కడ ఆనవాయితీగా వస్తుంది.

రైల్వే ట్రాక్ పునర్నిర్మాణ పనుల ప్రారంభం



రైల్వే పురాతన ట్రాక్‌ను తొలగించి, కొత్త పట్టాలు నిర్మించేందుకు మూసివేసిన రైల్వే గేటు

ఆకివీడు: బ్రాంచి రైల్వే లైన్‌లో పురాతన రైల్వే ట్రాక్‌ను తొలగించి, కొత్త ట్రాక్(పట్టా) పునర్నిర్మాణ పనుల్ని మంగళవారం ప్రారంభించారు. దీంతో స్థానిక సిద్ధాపురం రైల్వే గేటును ఈ నెల 12వ తేదీ వరకూ మూసివేశారు. డబుల్ రైల్వే లైన్ నిర్మాణం తో విజయవాడ–నిడదవోలు మధ్య గూడ్సు రైల్వే రాకపోకల సంఖ్య భారీగా పెరగడంతో బ్రిటీష్ కాలం నాటి రైలు పట్టాల్ని తొలగించే పనులను ముమ్మరం చేశారు. విజయవాడ నుంచి భీమవరం వరకు పురాతన రైలు పట్టాలను తొలగించి, దాని స్థానంలో కొత్త పట్టాలను ఏర్పాటు చేస్తున్నారు. దీంతో ఆయా రైల్వే గేటుల వద్ద ట్రాఫిక్‌కు అంతరాయం కలిగే అవకాశం ఉండటంతో గేట్లను మూడు రోజుల పాటు మూసివేస్తున్నారు.

డాక్టర్ బాలచందర్‌కు ఉగాది పురస్కారం

పెనుగొండ: అంతర్జాతీయ ఖ్యాతి గాంచిన ప్రముఖ సామితీ సంస్థ తెలుగు వెలుగు జాతీయ సాహిత్యా వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ కవిసమ్మేళనంలో పెనుగొండకు చెందిన కవి, రచయిత, గాయకుడు ఎస్వీకేపీ పితాని వెంకన్న జూనియర్ కళాశాల తెలుగు విభాగాధిపతి డాక్టర్ బాలచందర్ ఉగాది పుర స్కారాన్ని అందుకున్నారు. మంగళవారం ఈ మేరకు డాక్టర్ బాలచందర్ వివరాలను తెలిపారు. సంస్థ అధ్యక్ష కార్యదర్శులు పక్కి రవిశేఖర సత్యనారాయణ మూర్తి, మోటూరి నారాయణరావు, న్యాయ నిర్ణేత గౌరవ రాజు సతీష్‌కుమార్‌లు ఉత్తమ కవితను అందించినందుకు గానూ డాక్టర్ బాల చందర్‌ను అభినందిస్తూ ప్రశంసా పత్రం అందించారనితెలిపారు.

అంబేడ్కర్ ఆశయాలతో పని చేయాలి


ఆచంట వేమవరంలో నియామక పత్రాలు అందిస్తున్న పుష్పరాజ్

పెనుగొండ: ప్రభుత్వాలు అంబేడ్కర్ ఆశయాలతో పనిచేయాలని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు నన్నేటి పుష్ప రాజ్ అన్నారు. మంగళవారం ఆచంట వేమవరం మాల మహానాడు కార్యాలయంలో పెనుమంట్ర మండల యువజన విభాగం అధ్యక్షులుగా గెడ్డం జాన్సన్, నెలమూరు గ్రామ గౌరవ అధ్యక్షుడిగా ఎడ్ల గంగరాజు, నెలమూరు గ్రామ అధ్యక్షుడిగా నేలపూడి సురేష్, ఉపాధ్యక్షుడిగా ఎడ్ల జూబ్లీ రాజు, ప్రధాన కార్యదర్శిగా సాక ఏసు, కార్యదర్శిగా పాలపర్తి వెంకట నరసయ్య, సహాయ కార్యదర్శిగా వీసా కోటి లాజరులను నియమించి నియమక పత్రాలు అందజేశారు.

వీరపేరంటాలమ్మను దర్శించిన పీవీఎల్

ఉండి: వెలివర్రు వీరపేరంటాలమ్మ అమ్మవారి 71వ వార్షిక జాతర మహోత్సవాలను మంగళవారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా అమ్మవారికి విశేష పూజలు చేశారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని వైఎస్సార్ సీపీ ఉండి ఎమ్మెల్యే అభ్యర్థి పీవీఎల్ నరసింహరాజు వెలివర్రు వీరపేరంటాలమ్మను దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఆయనతోపాటు టీటీడీ మాజీ సభ్యుడు గోకరాజు రామరాజు, పీవీఎల్ సోదరుడు గోపాలకృష్ణంరాజు అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం పీవీఎల్ మాట్లాడుతూ క్రోధి నామ సంవత్సరంలో ప్రజలకు అంతా మంచి జరగాలని ఆకాంక్షించారు. నీతినిజాయితీతో ప్రజలకు సంక్షేమ పాలన అందించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని అమ్మవారిని ప్రార్థించారు. ప్రజాభిమానంతో 175 అసెంబ్లీ స్థానాల్లో, 25 పార్లమెంట్ స్థానాల్లో వైఎస్సార్ సీపీ గెలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు, జెడ్పీటీసీ రణస్తుల కనకదుర్గమహంకాళి, ఎం.కొండరాజు, కళ్ళేపల్లి సతీష్‌రాజు, రణస్తుల మహంకాళి, హరివర్మ తదితరులు పాల్గొన్నారు.


వెలివర్రు వీరపేరంటాలమ్మను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే అభ్యర్థి పీవీఎల్ నర్సింహరాజు

శ్రీరామరాజు సేవలు వెలకట్టలేనివి

పాలకోడేరు: సీపీఎం భీమవరం తాలూకా నాయకునిగా, గొల్లలకోడేరు గ్రామ సర్పంచిగా, రైతు సంఘ నాయకునిగా అనేక పోరాటాలు నిర్వహించిన కామ్రేడ్ శ్రీరామరాజు సేవలు వెలకట్టలేనివని సీపీఎం జిల్లా కార్యదర్శి బి బలరాం అన్నారు. కామ్రేడ్ గాదిరాజు శ్రీరామరాజు 33వ వర్ధంతి గొల్లలకోడేరులో శేషపు అశ్రియ్య అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ముందుగా శ్రీరామరాజు విగ్రహానికి బి బలరాం, గోపాలన్, శ్రీరామరాజు కుమారుడు సూర్యనారాయణరాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో బలరాం మాట్లాడుతూ ప్రజాసమస్యల పరిష్కారంలో శ్రీరామరాజు అలుపెరుగని పోరాటాలు ఎన్నోచేసి ప్రజల మన్ననలు పొందారని కొనియాడారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జె ఎన్వీ గోపాలన్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ, బత్తిన నాగేశ్వరరావు, చెల్లబోయిన సింహాచలం, కలిదిండి గోపాలరాజు దున్న మరియమ్మ, కిలారు లక్ష్మీశాలిని, కె.జ్యోతి తదితరులు పాల్గొన్నారు.


శ్రీరామరాజు విగ్రహానికి పూలమాలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

వేద పండితులకు, అర్చకులకు ఉగాది పురస్కారాలు

భీమవరం (ప్రకాశంచౌక్): క్రోధి నామ సంవత్సర ఉగాది పర్వదినం సందర్భంగా జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ చేతులమీదుగా వేదపండితులు, అర్చకులకు సత్కారాలు నిర్వహించారు. గొల్లపల్లి వెంకట నాగ శ్రీరామ శర్మ అవధాని, అర్చకులు సుదర్శనం రాధాకృష్ణమాచార్యులు, మంచిలి విశ్వనాథ శర్మకు ఒక్కొక్కరికి రూ 10,116 నగదు పురస్కారం, ప్రశంశా పత్రం, శాలువాలతో సత్కరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ అంకిత భావంతో ఆలయాలలో సేవలందిస్తున్న వీరిని ఉగాది పురస్కారాలతో సన్మానించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. జిల్లా దేవదాయ శాఖ అధికారి ఈ. వెంకట సుబ్బారావు, భీమవరం శ్రీ మావుళ్లమ్మ అమ్మవారి దేవస్థానం సహాయ కమిషనర్ కార్యనిర్వహణాధికారి బి.లక్ష్మీ నగేష్ తదితరులు పాల్గొన్నారు.


వేద పండితులను సత్కరిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్ తదితరులు

ఘనంగా పల్లకీ సేవ

భీమవరం (ప్రకాశం చౌక్): ఉగాది సందర్భంగా భీమవరం మెంటేవారితోటలోని బాలత్రిపుర సుందరిదేవి అమ్మవారికి 108 కలశాలతో ఘనంగా గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో గొట్టుముక్కల వెంకటలక్ష్మి, నాయుడు నాగేంద్ర దంపతులు, కంచిరాజు వెంకటరావు, ఆలయ అర్చకులు కొమ్ము శ్రీనివాస్ అమ్మవారికి కుంకుమ పూజలు, అభిషేకాలు వేదమంత్రాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి వేదమంత్రాలతో పూజ చేసి వివిధ రకాల పుష్పాలతో ఆలంకరణ చేశారు. ఆలయ ప్రాంగణం నుంచి మెంటే వారి తోటలోని ప్రధాన వీధుల్లో 108 కలశాలతో అమ్మవారి ఉత్సవ విగ్రహంతో గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ అభివద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


అమ్మవారికి పల్లకీసేవ నిర్వహిస్తున్న భక్తులు

చండ్ర ఆశయ సాధనకు కృషి చేయాలి

భీమవరం: అసమానతలు దోపిడీ లేని కుల,మత రహిత సమాజం కోసం తన జీవితాన్ని ధారపోసిన చండ్ర రాజేశ్వరరావు ఆశయ సాధనకు యువత పునరంకితం కావాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు పిలుపునిచ్చారు. రాజేశ్వరరావు 30వ వర్ధంతిని బుధవారం భీమవరం ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయంలో నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. సంపన్న కుటుంబంలో జన్మించిన చండ్ర ఊడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం బెనారస్ యూనివర్సిటీలో తన వైద్య విద్యను తృణప్రాయంగా వదిలేసి సమాజ సేవలో భాగం పంచుకున్నారని గుర్తు చేశారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం తుది శ్వాసవిడిచే వరకు పనిచేశారని కొనియాడారు. ముందుగా రాజేశ్వరరావు చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చెల్లబోయిన రంగారావు, ఎం సీతారాంప్రసాద్, మల్లుల శ్రీనివాసరావు, వైవిఆనంద్, కె విల్సన్, కెవివిబ్రహ్మం, తిరుమాని చంటిరాజు పాల్గొన్నారు.


చండ్ర రాజేశ్వరరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

క్రికెట్ టోర్నమెంట్

తాడేపల్లిగూడెం రూరల్: కుంచనపల్లి గ్రామంలో డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని జై భీమ్ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్‌ను మంగళవారం నిర్వహించారు. మొత్తం నాలుగు టీమ్‌లో పాల్గొనగా, రెండు టీమ్‌లు ఫైనల్‌కు చేరుకున్నాయి. చివరి మ్యాచ్‌లో నవీన్ టీమ్‌పై రమేష్ టీమ్ విజయం సాధించిందని జైభీమ్ యువజన సేవా సంఘం సభ్యులు తెలిపారు.

భక్తులతో కిటకిటలాడిన అమ్మవారి ఆలయాలు

ఆకివీడు: ఉగాది పర్వదినం పురస్కరించుకుని మంగళవారం అమ్మవార్ల ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పలు ఆలయాల్లో అమ్మవార్లను విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. స్థానిక పెద్దింటి అమ్మవారు, వనువులమ్మవారు, మాదివాడలోని గంగానమ్మ, మద్దిరావమ్మ అమ్మవార్లను భక్తులు దర్శించుకున్నారు. కొత్త సంవత్సరంలో సుఖ సంతోషాలతో జీవించాలని అమ్మవార్లను ప్రార్థించారు.

మావుళ్లమ్మ ఆలయంలో ఉగాది వేడుకలు

భీమవరం (ప్రకాశంచౌక్): క్రోధి నామ సంవత్సరం ఉగాది సందర్భంగా మావుళ్లమ్మ అమ్మవారి ఆలయంలో నందు ఆలయ ప్రధాన అర్చకులు మద్దిరాల మల్లికార్జునశర్మచే విశేష పూజలు నిర్వహించారు. అనంతరం వేద పండితులచే పంచాంగ పఠన కార్యక్రమం చేపట్టారు. ఆలయ పండితులకు ఉగాది పురస్కారం అందజేశారు. ఈ కార్యక్రమమునకు విచ్చేసిన భక్తులకు ఆలయ సహాయ కమీషనర్ బి. యల్. నగేష్ 2024 –25 పంచాంగములు, ప్రసాదం అందచేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. అలాగే గునుపూడిలో సోమేశ్వర జనార్ధన స్వామి వార్ల దేవస్థానంనందు ఉగాది ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాలను పంచారామక్షేత్రం కార్యనిర్వహణాధికారి డి.రామకృష్ణంరాజు పర్యవేక్షించారు.


పూజలందుకున్న వనువులమ్మ అమ్మవారు


విశేష అలంకరణలో పెద్దింటి అమ్మవారు


ప్రత్యేక అలంకరలో భక్తులకు దర్శనమిచ్చిన మాదివాడ గంగానమ్మ, మద్దిరావమ్మ అమ్మవార్లు


పంచాంగ శ్రవణం చేస్తున్న ప్రధాన అర్చకులు మద్దిరాల మల్లికార్జున్ శర్మవేద పండితులు

యువతితో అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు నమోదు

ఆకివీడు: యువతితో అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై బి.నాగబాబు మంగళవారం తెలిపారు. వివరాల ప్రకారం జగ్గయ్యపేటలో మహిళా కళాశాలలో చదువుతున్న యువతి సెలవుల నిమిత్తం తన అమ్మమ్మ గ్రామమైన గుమ్ములూరు వెళ్లేందుకు ఈ నెల 8వ తేదీన ఆకివీడు చేరుకుంది. రాత్రి 9.45 నిమిషాలకు గుమ్ములూరు వెళ్లేందుకు వాహనాల కోసం వేచి చూస్తున్న సమయంలో తన అమ్మమ్మ ఇంటి ప్రక్కన నివసించే రొయ్య వేణుగోపాల్ తన వాహనంపై తీసుకువెళతానని చెప్పి మోటారు సైకిల్ ఎక్కించుకుని మార్గమధ్యలో ఆమెతో అసభ్యకరంగా ప్రవర్తించేందుకు యత్నించాడు. దీంతో భయపడిన ఆమె మోటారుసైకిల్ నుంచి దూకేసి విషయం తన సోదరుడు, సోదరికి ఫోన్ చేసి తెలియజేసింది. అనంతరం బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వేణుగోపాల్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

కోడిపందేలపై దాడి

మండలంలోని సిద్ధాపురం గ్రామ శివారు కురుపాకలో కోడి పందేలు ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.4,500 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై బి.నాగబాబు చెప్పారు.

పుంతలో ముసలమ్మ ఉత్సవాలు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక శ్రీరామ్‌పేటలో కొలువై ఉన్న శ్రీ పుంతలో ముసలమ్మ అమ్మవారిని మంగళవారం ఎమ్మెల్సీ కవురు శ్రీనివాసు, పార్టీ చింతలపూడి నియోజకవర్గ పరిశీలకులు గుణ్ణం నాగబాబు దర్శించుకున్నారు. ఈసందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఇరువురినీ శాలువాతో సత్కరించారు.

అంబేడ్కర్ జీవిత చరిత్ర అందరికీ తెలియజేయాలి

భీమవరం: భారతరాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీవిత చరిత్ర అందరికీ తెలియజేయాల్సిన అవసరం ఎంతైన ఉందని ఏపీ బహుజన జేఏసీ ఫౌండర్ అండ్ కన్వీనర్ తాళ్ళూరి మధు అన్నారు. అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని మంగళవారం భీమవరం లూథరన్ హైస్కూల్లో విద్యార్థులకు అంబేడ్కర్ జీవిత చరిత్రపై వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందచేశారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జేఏసీ జిల్లా కన్వీనర్ ఈది రవికుమార్ అధ్యక్షత వహించారు. గౌరవాధ్యక్షుడు కాటం స్టాన్లీరాజు, స్టేట్ ప్రెసిడెంట్ కోనా జోసఫ్ మాట్లాడుతూ ఈనెల 14వ తేదిన అంబేడ్కర్ జయంతిని జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలన్నారు. దీనికి ప్రధాన కారణం అంబేడ్కర్ ఆశయాలను ప్రజల్లోనికి విస్తృతంగా తీసుకువెళ్లడమే లక్ష్యమన్నారు. అనంతరం పోటీల్లో విజేతలకు వాటర్ బాటిల్స్ పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో జేఏసీ నాయకులు బిరుదుగడ్డ రమేష్‌బాబు, బుంగా ఆదాము, బందెల జార్జిరాజు,గరికిముక్కు మేరీఅలీషా, బందెల ప్రమీల, విప్పర్తి సత్యవేణి, చిగురుపాటి రాహేలు తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఏపీ బహుజన జేఏసీ నాయకులు

చిత్రకళ వ్యాప్తికి అంకాల ఆర్ట్ అకాడమీ కృషి ప్రశంసనీయం

భీమవరం: అధునిక సాంకేతికత, డిజిటల్ మార్పుల ప్రభావంతో, సాంప్రదాయ కళలు మరుగున పడే పరిస్థితి ఏర్పడిందని ఇటువంటి తరుణంలో చిత్రకళ వ్యాప్తికి అంకాల ఆర్ట్ అకాడమీ చేస్తున్న కృషి ప్రశంసనీయమని భీమవరం సహాయ వాణిజ్య పన్నుల అధికారిణి ఎం శేషుకుమారి అన్నారు. మంగళవారం అంకాల ఆర్ట్ అకాడమీలో చిత్రకారులు కట్టిబోయిన శ్రీనివాస్, పరిమి రామకృష, గ్రంధి నర్సింహమూర్తిలను సత్కరించిన సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో శేషుకుమారి ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులకు చిత్రకళలో మెళుకువలు నేర్పుతూ తీర్చిదిద్దుతున్నారని ప్రతి అదివారం నిర్వహిస్తున్న ఉచిత శిక్షణను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అకాడమీ అధ్యక్ష, కార్యదర్శులు గ్రంధి వెంకట్రావు, కాగిత వెంకటరమణ, కోశాధికారి గోపా సత్యనారాయణ, సహాయ కార్యదర్శి భాను, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.


భీమవరం అంకాల ఆర్ట్ అకాడమీలో చిత్రకారులను సత్కరిస్తున్న దృశ్యం

రోగుల సేవలో శ్రీరంగనాథరాజు


గుంటూరు ఆసుపత్రిలో స్వయంగా వడ్డిస్తున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

పెనుగొండ: ఉగాది పండుగను మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు రోగుల సేవలో గడిపారు. క్రోధి నామ తెలుగు సంవత్సరాది సందర్భంగా గుంటూరులోని జీజీహెచ్ ఆసుపత్రిలో సొంత ఖర్చులతో నిర్వహిస్తున్న భోజన శాలలో రోగులకు, వారి సహాయకులకు మంగళవారం స్వహస్తాలతో భోజనాలు అందించి సేవా తత్పరతను చాటుకొన్నారు. గృహ నిర్మాణ శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్న సమయంలో ఉమ్మడి గుంటూరు జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీరంగనాథరాజును నియమించడంతో అప్పట్లో గుంటూరు జీజీహెచ్ ఆసుపత్రిని సందర్శించి రోగుల సహాయకులు భోజనాలకు పడుతున్న ఇబ్బందులను గుర్తించారు. వెంటనే శ్రీరంగనాథరాజు సత్వరం స్పందించి రూ.కోట్లతో ఆసుపత్రి ఆవరణలోనే ఉన్న ఎన్జీవో హోంను భోజన శాలగా తీర్చిదిద్దారు. అప్పటి నుంచి నిత్యం ఉదయం, సాయంత్రం రెండుపూట్ల సుమారు 1500 మందికి భోజన శాలలో ఉచితంగా భోజనాలు చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
భీమవరం డివిజన్
90102 23729
Office mail : tpgadvt@gmail.com